# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 24-07-2025** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **దేశంలో ఆహార భద్రత కల్పించడంలో వ్యవసాయ రంగం కీలకపాత్ర పోషిస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు.**

**5.** **ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సమావేశమైన రాష్ట్ర మంత్రివర్గం 42 అంశాల ఎజెండాపై చర్చిస్తోంది.**

**3.** **రాష్ట్రంలో 3 కోట్ల మందికి పైగా కాన్సర్ పరీక్షలు నిర్వహించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు.**

**4.** **అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ శాఖను బలోపేతం చేస్తున్నామని హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత తెలిపారు.**

**5.** **పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమకు సాగు, త్రాగునీరు అందించనున్నామని మంత్రి నిమ్మల రామానాయుడు పేర్కొన్నారు.**

==========================

దేశంలో ఆహార భద్రత కల్పించడంలో వ్యవసాయ రంగం కీలకపాత్ర పోషిస్తోందని గవర్నర్ జస్టిస్ ఎస్.అబ్దుల్ నజీర్ అన్నారు. కృష్ణా జిల్లా ఉంగుటూరు మండలం, ఆత్కూర్‌లోని స్వర్ణభారతి ట్రస్ట్‌లో నిర్వహించిన ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ 57వ స్నాతకోత్సవంలో గవర్నర్ ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా డిగ్రీ పట్టాలతోపాటు ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు పతకాలను ప్రదానం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహకంతో ఈ ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయరంగంలో అధిక దిగుబడులు వచ్చాయని గవర్నర్ తెలుపుతూ...

..వాయిస్..33 సెకన్లు

---------------------------

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన రాష్ట్ర మంత్రి వర్గం ఈ రోజు సమావేశమైంది. అమరావతి లోని రాష్ట్ర సచివాలయంలో జరుగుతున్న ఈ సమావేశంలో 42 అంశాల ఎజెండాపై మంత్రి వర్గం చర్చిస్తోంది. రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సహక బోర్డు –ఎస్ఐపీబీ, రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ– సీఆర్డీఏ ప్రతిపాదనలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. అలాగే నాలా చట్ట సవరణతో పాటు లే అవుట్లు, భవనాల క్రమబద్ధీకరణ వంటి అంశాలపై మంత్రి వర్గం చర్చించనుంది. కాగా

మంత్రి వర్గ సమావేశం అనంతరం ముఖ్యమంత్రి రోడ్లు, భవనాల శాఖపై సమీక్ష నిర్వహిస్తారని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

---------------------------

రాష్ట్రంలో 3 కోట్ల మందికి పైగా కాన్సర్ పరీక్షలు నిర్వహించామని వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తెలిపారు. గుంటూరు జిల్లా చినకాకానిలో సంక్రమించని వ్యాధుల నివారణ, నియంత్రణ జాతీయ కార్యక్రమం –ఎన్‌పి–ఎన్‌సిడిలో భాగంగా రాష్ట్ర స్థాయి కార్యశాలలో మంత్రి ఈరోజు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ, సంక్రమించని వ్యాధులకు నిర్వహించే పరీక్షలపై మరింత అవగాహన కల్పించేందుకు రాష్ట్ర స్థాయి కార్యశాలను నిర్వహించామన్నారు. మధుమేహం, రక్తపోటుతో పాటు దేశంలో ఎక్కడా లేని విధంగా క్యాన్సర్ పరీక్షలు కూడా చేపట్టామని మంత్రి తెలిపారు.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే “మన్ కీ బాత్” మనసులోని మాట కార్యక్రమం 124వ సంచిక ఈనెల 27వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది.“మన్ కీ బాత్” కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు రేపు సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో పోలీస్ శాఖను బలోపేతం చేస్తున్నామని హోం మంత్రి వంగలపూడి అనిత తెలిపారు. ఏలూరు జిల్లాలోని పోలవరం పోలీస్ స్టేషన్ను ఆమె నిన్న ప్రారంభించారు. మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా చేసేందుకు పోలీసులకు ప్రజల సహకారం అవసరమని ఈ సందర్భంగా మంత్రి తెలియజేస్తూ...

..వాయిస్...30 సెకన్లు

---------------------------

పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసి ఉత్తరాంధ్రతో పాటు రాయలసీమకు సాగు, త్రాగునీరు అందించనున్నామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. సర్ ఆర్థర్ కాటన్ వర్ధంతి సందర్భంగా అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో మంత్రి ఆయనకు ఈరోజు నివాళులర్పించారు. ఈ సందర్భంగా మంత్రి రామానాయుడు మాట్లాడుతూ, ధవళేశ్వరం ఆనకట్టతో పాటు ఉభయ గోదావరి జిల్లాల్లో కాలువల నిర్మాణాలకు, కృష్ణానది ఆనకట్టకు కృషి చేసిన కాటన్ కృషి చేశారని చెప్పారు. కాటన్ స్ఫూర్తితో గోదావరి వరద జలాల వినియోగానికి ప్రభుత్వం పోలవరం–బనకచర్ల ప్రాజెక్టుకు రూపకల్పన చేసిందని మంత్రి రామానాయుడు వివరించారు.

---------------------------

ఆధునిక తెలుగు కవులలో ప్రముఖ స్థానం సంపాదించిన గుర్రం జాషువా వర్ధంతి ఈ రోజు. తెలుగు సాహితీ లోకంలో నవయుగ కవి చక్రవర్తిగా పేరొందిన గుర్రం జాషువా 1895 సెప్టెంబర్ 28వ తేదీన గుంటూరు జిల్లా వినుకొండలో జన్మించారు. సామాజిక ప్రయోజనం కలిగిన అంశాలు ప్రధాన ఇతివృత్తాలుగా రచనలు చేశారు. “గబ్బిలం” రచనతో మంచి పేరు సంపాదించి, తన కవితా ప్రతిభకు గుర్తింపుగా ఎన్నో పురస్కారాలు అందుకున్న గుర్రం జాషువా 1971 జూలై 24వ తేదీన తుది శ్వాస విడిచారు.

---------------------------

సైబర్ నేరాల పట్ల ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఆంధ్రప్రదేశ్ టెక్నాలజీ సర్వీసెస్ – ఏపీటీఎస్ ఛైర్మన్ ఎం. మోహనకృష్ణ తెలిపారు. ఈరోజు విజయవాడలోని ఏపీటీఎస్ కార్యాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో సైబర్ భద్రత విధానాలను అమలు చేసే నోడల్ ఏజెన్సీగా తమ సంస్థ వివిధ రకాల సేవలను అందిస్తోందని చెప్పారు. సైబర్ దాడులను నియంత్రించడానికి, డిజిటల్ భద్రతను కల్పించేందుకు ఏపీటీఎస్ పనిచేస్తుందన్నారు.

---------------------------

దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు ఈరోజు నష్టాలలో కొనసాగుతున్నాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయానికి సెన్సెక్స్ 583 పాయింట్ల నష్టంతో 82 వేల 142 వద్ద ట్రేడవుతుండగా, నిఫ్టీ 166 పాయింట్ల నష్టంతో 25 వేల 052 వద్ద ట్రేడవుతోంది.

---------------------------

ఉపరితల ఆవర్తనం ప్రభావంతో బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశముందని అమరావతిలోని భారత వాతావరణ కేంద్రం తెలిపింది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు జిల్లాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ అధికారి జి.లక్ష్మి తెలియజేస్తూ...

వాయిస్..20 సెకన్లు

---------------------------

ఆగస్టు 15వ తేదీన నిర్వహించనున్న స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను రాజధాని అమరావతిలోనే నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించిందని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ వెల్లడించారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో అధికారులతో ఆయన నిన్న సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా విజయానంద్ మాట్లాడుతూ, రాజధాని అమరావతి ప్రాంతంలో తొలిసారిగా 79వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను నిర్వహించనున్నామని తెలిపారు. రాష్ట్ర సచివాలయం వద్ద వేడుకలను జరపాలని ప్రభుత్వం నిర్ణయించిందని, అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

=====================